21–02–2023,
విజయవాడ.

ఎ కన్వెన్షన్ సెంటర్‌లో గవర్నర్ శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఏపీ ప్రభుత్వం ఆత్మీయ వీడ్కోలు సమావేశం.
గవర్నర్ ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన సీఎం శ్రీ వైయస్.జగన్.

ఈ సందర్భంగా సీఎం శ్రీ వైయస్.జగన్ ఏమన్నారంటే...:

శ్రీ బిశ్వభూషన్ హరిచందన్ గారికి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున, ప్రభుత్వం తరపున, నా తరపున అభినందనలుతో పాటు ధన్యవాదాలు కూడా తెలుపుతున్నాను. చత్తీస్‌ఘడ్ గవర్నర్‌గా వెళ్తున్నందుకు అభినందనలు.
ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆత్మీయుడైన పెద్దమనిషిగా, గవర్నర్ వ్యవస్థకు ఒక నిండుతనం తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు.

హరిచందన్‌గారు గవర్నర్‌గా ఉన్న ఈ మూడు సంవత్సరాల కాలంలో రాజ్యాంగ వ్యవస్ధల మధ్య ఉండాల్సిన సమన్వయం అన్నది ఎలా ఉండాలో ఆచరణలో గొప్పగా చూపించారు. గవర్నర్లకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య సంబంధాల మీద ఈ మధ్య కాలంలోనే చాలా సందర్భాలలో వార్తలు చూస్తూనే ఉన్నాం. కానీ మన రాష్ట్రం మాత్రం అందుకు భిన్నంగా, తండ్రిలా, పెద్దలా ఈ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక్కడి ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తూ మన గవర్నర్ గారు వాత్సల్యం చూపించారు.

మన గవర్నర్ గారి విషయాలు క్లుప్తంగా నెమరువేసుకోవాలి. హరిచందన్ గారు ఉన్నత విద్యావేత్త. న్యాయనిపుణులు. వీటన్నింటికీ మించి ఆయన స్వాతంత్ర్య సమరయోధులు కూడా. ఒడిశా ప్రభుత్వంలో నాలుగుసార్లు మంత్రిగా పనిచేసిన హరిచందన్ గారు తాను మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ప్రతిశాఖలోనూ తనదైన ముద్ర చూపారు.
5 సార్లు ఒడిశా అసెంబ్లీకి ఎన్నికైన ఆయన 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్ధిపై 95 వేల మెజార్టీ సాధించి అప్పట్లో ఒక రికార్డు సృష్టించారు.

న్యాయవాదిగా కూడా పనిచేసిన శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్‌గారు ఒడిశా హైకోర్టులో బార్ అసోసియేషన్ యాక్షన్ కమిటీ ఛైర్మన్‌గా కూడా న్యాయవాదుల సంక్షేమం కోసం, హక్కుల కోసం నిరంతరం పాటుపడ్డారు.

శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్ గారికి ప్రతిచోటా కూడా వెన్నుదన్నుగా నిల్చి ఆయన విజయానికి కారణమయ్యారు ఆయన సతీమణి శ్రీమతి సుప్రవ హరిచందన్‌గారు. ఆమెకి కూడా ఈ రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం తరపున, నా కుటుంబం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

చివరిగా దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో శ్రీబిశ్వభూషణ్ హరిచందన్‌గారు వారి కుటుంబం నిండు నూరేళ్లు జీవించాలని అందరికీ ఇంకా ఎంతో సేవ చేయాలని మనసారా కోరుకుంటూ.. మీతో మా తీపి జ్ఞాపకాలు మా మనసులో ఎల్లప్పుడూ ఉంటాయని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను అని సీఎం ప్రసంగం ముగించారు.

అనంతరం గవర్నర్ శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్‌ను ఆత్మీయంగా సత్కరించిన సీఎం శ్రీ వైయస్.జగన్.